ప్రజాశక్తి

శుక్రవారం 7 నవంబర్ 2025 | 5 | విజయనగరం



మాత, శిశు మరణాల నివారణకు చర్యలు

డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మాత, శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ జీవనరాణి తెలిపారు. మాత, శిశు మరణాలపై గురువారం జిల్లా సబ్ కమిటీ సమీక్షా సమావేశాన్ని డిఎంహెచ్ఒ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జిల్లాలో సంభవించిన 3 మాతృ మరణాలు, ఎంపిక చేసిన 6 శిశు మరణాలపై ఆరా తీశారు. కారణాలను విశ్లేషించి భవిష్యత్తులో మరణాలు సంభవించకుండా ఉండేందుకు క్షేత్రస్థాయి నుంచి ఉన్నత శ్రేణి ఆసుపత్రికి తరలించే వరకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో మాతృ, శిశు మరణాల జిల్లా ఉప కమిటీ నోడల్ అధికారి ఆర్.అచ్యుతకుమారి, డాక్టర్ ఎస్.పి.పద్మశ్రీరాణి, డాక్టర్ సుజాత, ఎ.దీపక్‌కుమార్, జి.వి.కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మరణాలపై ప్రశ్నిస్తే.. శవరాజకీయాలంటారా?

- విద్యార్థుల జ్వరాలకు బాధ్యత లేదంటారా?
- మంత్రి సంధ్యారాణిపై జెడ్పి సభ్యుల ఆగ్రహం
- ఇప్పటికైనా వసతిగృహాలను పట్టించుకోవాలని హెచ్చరిక
- మెడికల్ కళాశాల ప్రయివేటీకరణపైనా రచ్చ
- పిపిపికి వ్యతిరేకంగా తీర్మానం
- తుపాను నష్టగణన, అన్నదాత సుఖీభవలో పారదర్శకతకు పట్టు
- వాడీవేడిగా జెడ్పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/కంటోన్మెంట్

సమావేశంలో పాల్గొన్న జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మంత్రులు కొండపల్లి, సంధ్యారాణి, కలెక్టర్లు

'గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రశ్నిస్తే శవ రాజకీయాలంటారా? అసలు మంత్రిగా మీకు బాధ్యత ఉందా? లేదా?... జ్వరాలు వస్తే నాకేంటి సంబంధం అన్నట్టుగా మాట్లాడుతున్నారు?!... ఎంత వరకు సమంజసం...! జనాలకు సమస్యలు ఉత్పన్నమైతే ప్రజాప్రతినిధులుగా మిమ్మల్ని ప్రశ్నించే హక్కు మాకుంది. ఏ మనుకుంటున్నారో మీరు... ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే వసతి గృహాల్లోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి.... మరణాలను అరికట్టేందుకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయండి... అంతేగాని ప్రశ్నించినవారిపైన, మాజీ మంత్రులపైన మీ ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదంటూ' అంటూ జిల్లా పరిషత్‌లోని మెజార్టీ సభ్యులు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థుల మరణాలు, మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ, అన్నదాత సుఖీభవ అందరికీ అందకపోవడం, తుపాను నష్టగణన పూర్తిస్థాయిలో చేయకపోవడం తదితరాలపై వాడీవేడిగా చర్చ నడిచింది. వైద్యారోగ్య శాఖపై చర్చ నడుస్తుండగా 'గిరిజన విద్యార్థుల మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా జిల్లాలో ఉండి కూడా ఒకింత నిర్లక్ష్యంగా వ్యవహరించడం, బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం సరికాదంటూ' పెద్దపెట్టున నిలదీశారు. దీనిపై మంత్రి బుకాయించేందుకు ప్రయత్నించడంతో మన్యం జిల్లా పరిధిలోని జెడ్పి సభ్యులంతా పెద్దపెట్టున కేకలు వేస్తూ మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో, ఆ విద్యార్థుల మరణాలు బాధాకరమంటూ స్వరం మార్చారు. కురుపాంలో ఇద్దరి విద్యార్థుల మరణం తరువాత 'నా సొంత నియోజకవర్గం సాలూరులో కూడా ఇద్దరు విద్యార్థులు చనిపోయిన మాట వాస్తవమేనని, ఇకపై ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోకుండా చూడాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చామని చెప్పారు. ఈ అంశంపై సుమారు 45నిమిషాలపాటు సమావేశంలో చర్చ నడిచింది. మరోవైపు మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపైనా సమావేశం తీవ్రంగా వ్యతిరేకించింది. పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాలలు నిర్వహించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పేదలకు తగిన వైద్యం అందే పరిస్థితి ఉండబోదని, పేద విద్యార్థులకు కూడా వైద్య విద్య అందుబాటులో ఉండే పరిస్థితి లేదని ఎమ్మెల్సీ సురేష్ బాబు సహా వైసిపికి చెందిన పలువురు సభ్యులు లేవనెత్తారు. పిపిపి అంటే ప్రైవేటు కాదంటూ జిల్లాకు చెందిన కొండపల్లి శ్రీనివాస్ సహా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ సహా పలువురు వాదించడంతో జెడ్పి సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరకు మెడికల్ కాలేజీని ప్రభుత్వ రంగంలోనే నడపాలంటూ విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని జెడ్పీ సభ్యులంతా ఆమోదించారు.

దీనికి ముందు ధాన్యం సేకరణపై జరిగిన చర్చలో భాగంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ 35 శాతం కన్నా ఎక్కువ పంట నష్టం జరిగితేనే నమోదు చేస్తున్నారని, అంత కన్నా తక్కువ జరిగిన వారి పరిస్థితేంటని ప్రశ్నించారు. ఇప్పటికీ పంట కొంత మేరకు నీటిలో మునిగి ఉందని, ధాన్యం రంగు మారే అవకాశం ఉందని, వాటిని ఏ విధంగా కొనుగోలు చేస్తారో రైతులకు వివరించాలని కోరారు. 30 శాతం లోపల నష్టం జరిగిన వారి వివరాలను కూడా నమోదు చేసి ప్రభుత్వం దృష్టి లో పెట్టాలని, వారికీ నష్ట పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంట నష్టాలను నమోదు చేసేటప్పుడు భౌతికంగా పంట ను తనిఖీ చేసి నమోదు చేయాలని, ఎవరో చెప్పారని నమోదు చేయకూడదని తెలిపారు. వీలైతే పంట నష్ట నష్టాలను నమోదు తేదీలను పొడిగించాలని కోరారు. అలాగే గోనె సంచులు ప్రభుత్వం సరఫరా చేస్తుందా లేక రైతులే సమకుర్చుకోవాలా స్పష్టంగా చెప్పాలన్నారు. జే.సి సేదు మాధవన్ స్పందిస్తూ జిల్లాకు కోటి గోనె సంచులు అవసరం అవుతాయని, ప్రస్తుతం జిల్లా స్థాయి లో 50లక్షల వరకు సర్దుబాటు అవుతున్నాయని, మిగిలిన వాటి కోసం ప్రభుత్వం స్థాయి లో చర్చ జరుగుతోందని తెలిపారు.

సమావేశంలో ప్రభుత్వ విప్ (కురుపాం ఎమ్మెల్యే) తోయక జగదీశ్వరి, విజయనగరం, మన్యం జిల్లాల కలెక్టర్లు ఎస్.రాంసుందర్ రెడ్డి, డాక్టర్ ఎన్ .ప్రభాకర్ రెడ్డి, విజయనగరం జాయింట్ సేదు మాధవన్, పార్వతీపురం సబ్-కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి, జెడ్పి సిఇఒ సత్యనారాయణ, ఎస్.కోట, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు కోళ్ళ లలిత కుమారి, లోకం నాగమాధవి, కాపు కార్పొరేషన్ ఛైర్పర్సన్ పాలవలస యశస్వి, రెండు జిల్లాలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పిపిపి పద్ధతిలోనే మెడికల్ కాలేజీ

మంత్రి కొండపల్లి

పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజీ నిర్వహణ సాగుతుందని జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై జెడ్పిలో పెద్దఎత్తున చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పేదలకు ఎటువంటి అన్యాయం జరగబోదని, నాణ్యమైన వైద్య అందుతుందని అన్నారు. యూరియా ఎక్కువగా వినియోగించడం వలన కాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని, ఈ విషయంలో రైతులకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. 'కొత్త పించన్లు ఎప్పుడు ఇస్తారంటూ పలువురి సభ్యుల ప్రశ్నకు ఆయన స్పందిస్తూ దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వలేం

మంత్రి సంధ్యారాణి

ఇటీవల మృతిచెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎలాంటి నష్టపరి హారమూ ఇవ్వలేమని, ఇచ్చేందుకు కూడా అవకాశం లేదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తేల్చిచెప్పారు. సీతంపేటలో మృతిచెందిన బాలిక కుటుంబీకులకు రూ.2లక్షలు ప్రకటించినట్టే కురుపాంలో కూడా చెల్లించాలని జెడ్పి సభ్యులు కోరగా పై విధంగా మంత్రి స్పందించారు. ఇటువంటి పాలసీ తమ ప్రభుత్వంలో లేదని, గత ప్రభుత్వంలో కూడా ఇలా మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున పరిహారం చెల్లించలేదని అన్నారు. తన నియోజకవర్గంలో ఇటీవల మరణించిన ఇద్దరు విద్యార్థులకు కుటుంబీకులకు కూడా ప్రభుత్వం తరపున ఎలాంటి సాయం అందించే ప్రసక్తి లేదన్నారు.

సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మమ్దాని అభినందన కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు

న్యూయార్క్ మేయర్ సోషలిస్ట్ అభ్యర్థి గెలుపు

ట్రంప్ విధానాలకు చెంపపెట్టు

మేయర్ గా గెలిచిన జోహ్రాన్ మమ్దానికి జేజేలు : సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అమెరికాలో న్యూయార్క్ మేయర్‌గా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దాని గెలుపు ట్రంప్ నిరంకుశ విధానాలకు చెంపపెట్టు అని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. మేయర్ గా గెలిచిన జోహ్రాన్ మమ్దానికి జేజేలు పలుకుతూ సిపిఎం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి తమ్మినేని మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద నిరంకుశ విధానాలతో విసిగి పోయిన ప్రజలు డెమొక్రటిక్ పార్టీ సోషలిస్టు భావాలు కలిగిన అభ్యర్థిని మేయర్‌గా ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా న్యూయార్క్ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడుతున్నారనడానికి ఈ మేయర్ ఎన్నికే నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాలపై ఆధిపత్యం కోసం ట్రంప్ నిరంకుశ విధానాలకు పాల్పడుతున్న విషయం తెలిసిందేనన్నారు. ట్రంప్ విధానాలతో అమెరికాలో నిత్యావసర ధరలు, నిరుద్యోగం పెరిగిపోయాయన్నారు. దోపిడీ, నిరంకుశ పాలనను వ్యతిరేకించిన ప్రజలు మమ్దానీని గెలిపించుకున్నారని అన్నారు. సమపాలన అందిస్తామని, నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని ప్రజలకిచ్చిన హామీని నమ్మి ఓటువేసి గెలిపించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సోషలిస్టు శక్తులు బలోపేతం అవుతున్నాయన్నారు. దోపిడీ విధానాలు మానుకోకపోతే మన దేశంలోనూ అటువంటి ఫలితాలు రావడం ఖాయమ న్నారు. ఇదే స్ఫూర్తితో సోషలిస్ట్ శక్తులు మనదేశంలో కూడా కృషి చేయాలని, అందులో సిపిఎం అగ్ర భాగంలో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదులకు గుణపాఠం

బొబ్బిలి : ప్రపంచ దోపిడీదారులు, సామ్రాజ్యవాదులకు న్యూయార్క్ ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు తెలిపారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరపున సోషలిస్ట్ భావాలు కలిగిన మమ్దానీ విజయం సాధించడంతో అభినందనలు తెలిపారు. మన దేశంలో పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న పార్టీలకు శ్రమజీవులైన కార్మికులు, రైతులు, ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాల్, సిపిఎం నాయకులు బి.యుగంధర్, ఎం.ప్రసాద్, జె.ఏడుకొండలు పాల్గొన్నారు.

'అల్ట్రాటెక్' పనులు అడ్డగింత

ప్రజాశక్తి-కొత్తవలస

పనులను అడ్డుకుంటున్న రైతులు

మండలంలో అప్పన్నపాలెం పంచాయతీ దత్తి గ్రామంలో అల్ట్రాటెక్ కంపెనీ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన పెదిరెడ్ల వెంకటరమణ, కర్రి అప్పారావుకు చెందిన భూముల్లో వారి అనుమతి తీసుకోకుండా విద్యుత్తు లైన్ వేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం రైతులకు ఒక మాట కూడా చెప్పకుండా అర్ధరాత్రి పూట దొంగచాటుగా విద్యుత్తు పనులు చేయడంపై రైతులు మండిపడ్డారు. కుటుంబం మొత్తం ఈ భూమిపైనే ఆధారపడి బతుకుతున్నామని, న్యాయం చేయకపోతే చావు తప్ప తమకు వేరే మార్గం లేదంటూ ఆవేదన వెలిబుచ్చారు. ఈ విషయం తెలుసుకున్న తహశీల్దార్ అప్పలరాజు అక్కడికి చేరుకున్నారు. తక్షణం పనులు నిలుపుదల చేయాలంటూ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

రైతుల భూములపై ప్రభుత్వ కన్ను

- అభివృద్ధి పేరిట లాక్కొనేందుకు ప్రయత్నాలు
- గూడెపువలసలో భూసేకరణకు సిద్ధపడ్డ విఎంఆర్‌డిఎ అధికారులు
- తీవ్రంగా వ్యతిరేకించిన రైతులు

ప్రజాశక్తి-భోగాపురం

రైతులతో చర్చిస్తున్న విఎంఆర్‌డిఎ అధికారులు

భోగాపురం మండల పరిధిలో రైతుల భూములు మిగిలేలా కనిపించడం లేదు. అభివృద్ధి పేరుతో భూములు సేకరించేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. దీంతో రైతుల్లో గుబులు రేగుతోంది. ఇదే విషయమై 'ప్రజాశక్తి'లో దినపత్రికలో అక్టోబర్ 30న 'భోగాపురంలో భూములు మిగిలేనా?' అనే కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ప్రజాశక్తి ఊహించినట్లుగానే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం రైతుల భూములను సేకరించేందుకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించింది.

విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలో విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం 2వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ విధానంలో సేకరించేందుకు సిద్ధపడుతున్నట్లు తెలిసింది. ఇటీవల భోగాపురం మండలంలోని అమనాం జంక్షన్ సమీపంలోని పోలిపల్లి రెవెన్యూ పరిధిలో మాజీ సైనికులకు కేటాయించిన భూములను జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ పరిశీలించిన విషయం విదితమే. ఈ భూములను టాటా ఐటి కంపెనీకి అప్పగించేందుకు చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం... ఇప్పుడు అదే దారిలో మరో అడుగు వేస్తోంది. ఐటి, ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ అవసరాల కోసం సేకరించాలనే ఉద్దేశంతో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు విఎంఆర్‌డిఎ సర్వే అసిస్టెంట్ ఖాజా బాబా, గూడెపువలస విఆర్ఒ వాగ్దేవి.. గురువారం గూడెపువలస రెవెన్యూ పరిధిలోని భూములను పరిశీలించారు. రైతులతో చర్చలు జరిపారు. రైతులు మాత్రం ప్రభుత్వ ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించారు. 'ఎయిర్‌పోర్ట్ పేరిట ఇప్పటికే మా భూములను కోల్పోయాం. పరిహారం ఇప్పటికీ కొంతమందికి రాలేదు. కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికే చాలా కోల్పోయాం. మాకు మళ్లీ అన్యాయం చేస్తారా' అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరిట భూములను పలు దఫాలుగా లాక్కొని రైతులను వీధిన పెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

ఇక ఒక్క అంగుళం భూమి కూడా ఇచ్చేది లేదని, ఎంత ఒత్తిడి తెచ్చినా వెనక్కి తగ్గబోమని విఎంఆర్‌డిఎ అధికారులకు రైతులు తెగేసి చెప్పారు. రెండు రోజుల క్రితం లింగాలవలస గ్రామంలో కూడా సర్వే చేయడానికి వచ్చిన అధికారులను రైతులు అడ్డుకుని వెనక్కి పంపిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో గూడెపువలస సర్పంచ్ మట్టా అయ్యప్ప రామకృష్ణారెడ్డి, కొల్లి రామ్మూర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.

10 నుంచి ధాన్యం కొనుగోలు

జెసి సేధుమాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈనెల 10 నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ప్రకటించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జెసి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలుకు క్షేత్రస్థాయిలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇప్పటికే సంతకవిటి, వంగర, తెర్లాం తదితర కొన్ని మండలాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయని చెప్పారు. మరికొన్నిచోట్ల కొంచెం ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, కొనుగోలు కేంద్రాలను ముందుగానే సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల భారీగా వర్షాలు కురిసిన కారణంగా ధాన్యంలో తేమ ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. తేమను తగ్గించే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది ఈ-బిజిలను సమర్పించాలని, వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఈ ఏడాది సుమారు కోటి గోనెసంచులు అవసరమని, మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాల మేరకు గోనె సంచులను సిద్ధం చేయాలని చెప్పారు. సుమారు 4,600 వాహనాలకు జిపిఎస్ పరికరాలను అమరుస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు మిల్లర్లు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. సమావేశంలో డిఎస్ఒ మురళినాథ్, ఏఎంలు, మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, మిల్లర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేధు మాధవన్

పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ● జిల్లా స్థాయి అండర్-14 అథ్లెటిక్స్ ప్రారంభం

ప్రజాశక్తి-బొండపల్లి

శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బొండపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14 అథ్లెటిక్స్ పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించారు. క్రీడాజ్యోతిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు. మానసిక వికాసం, క్రీడా స్ఫూర్తి అలవడతాయని చెప్పారు. శరీరం దృఢంగా ఉంటే, మానసికంగా కూడా దృఢంగా ఉంటారని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా మంచి ఉద్యోగాలను కూడా పొందవచ్చునని చెప్పారు. క్రీడాకారులకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిఇఒ యు.మాణిక్యంనాయుడు మాట్లాడుతూ క్రీడా పోటీల నిర్వహణ వెనుకనున్న ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ అల్లు వెంకట రమణ, విద్యా కమిటీ ఛైర్మన్ బాలి వెంకట రమణ, ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

రెండో రోజూ ఎసిబి సోదాలు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు వరుసగా రెండో రోజు గురువారం సోదాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎసిబి బృందం కార్యాలయంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. గతంలో జరిగిన పలు రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తూ అవకతవకలపై ఆరా తీస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల నుండి అందిన ఫిర్యాదుల ఆధారంగా ఈ సోదాలు జరుగుతున్నాయని సమాచారం. గురువారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయనట్టు బోగట్టా. ఈ నేపథ్యంలోనే అనుమానం ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధం చేస్తున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు చేస్తున్న ఎసిబి అధికారులు

సహిత విద్యను బలోపేతం చేయాలి

విజయనగరంటౌన్ : క్షేత్రస్థాయిలో సహిత విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని జిల్లా విద్యాశాఖధికారి యు. మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు అన్నారు. గురువారం స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయం ఆడిటోరియంలో సహిత విద్యా విధానంపై ఎంఇఒలకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యాశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలన్నీ ప్రత్యేక అవసరాలు పిల్లలకు అందేలా ఎంఇఒలు చూడాలని కోరారు. రిసోర్స్ పర్సన్లు సునీల్ , రామునాయుడు, జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, సహ కోఆర్డినేటర్ ఎం. భారతి తదితరులు పాల్గొన్నారు.

అరకొర విద్యార్థులే

ఎం.సీతారాంపురం హాస్టల్లో సమస్యలు కొలువు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని ఎం.సీతారాంపురంలో బిసి బాలుర వసతిగృహంలో సమస్యలు కొలువై ఉన్నాయి. హాస్టల్ ముందు చెత్తాచెదారం ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆటస్థలంలో మురుగునీరు, పాముల పుట్ట ఉండడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పర్యవేక్షణ కొరవడడంతో 76 మంది విద్యార్థులకు గాను సగం మంది కూడా రాత్రి పూట ఉండడం లేదు.

బిసి బాలుర వసతి గృహంలో సమస్యలు నెలకొన్నాయి. ఈ హాస్టల్‌లో మొత్తం 76 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ నెల 3వ తేదీ సోమవారం ఉదయం ప్రజాశక్తి ఈ వసతి గృహాన్ని పరిశీలించేందుకు వెళ్లింది. అప్పటికి సగం మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వార్డెన్ పర్యవేక్షణ లేకపోవడంతో హాస్టల్లో ఎక్కువ మంది విద్యార్థులు రాత్రి పూట ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులకు కొన్నాళ్లుగా ప్రభుత్వం పెట్టెలు, ప్లేట్లు ఇవ్వకపోవడంతో బట్టలు పుస్తకాలు భద్ర పరుచుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచే పెట్టెలు తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా వసతిగృహం ప్రహరీ పక్కనే చెత్త చెదారం వేయటం వల్ల దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో అటువైపు వెళ్తే చాలు కంపు కొడుతోంది. నీరు వెళ్లే మార్గం లేక అక్కడ ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత పూర్తిగా పాడైపోవడం, మురుగు నీటి కాలువలు సక్రంగా లేకపోవడం వల్ల ఈ మురుగు నీరంతా హాస్టల్లో ఉన్న ఆట స్థలంలో చేరడం వల్ల విద్యార్థులు ప్రక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల ఆట స్థలానికి వెళ్లి ఆడుకోవలసిన పరిస్థితి ఉంది. మరోవైపు వసతి గృహం ఆవరణలో పాముల పుట్ట ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

హాస్టల్లో ఉన్న అరకొర విద్యార్థులు

పుట్టను గ్రామస్తులు దైవంగా పూజిస్తున్నారు

వసతి గృహంలో ఉన్న పుట్టను గ్రామస్తులు దైవంగా పూజిస్తారని అందుకే దాన్ని తొలగించలేకపోతున్నామని హెచ్‌డబ్ల్యుఒ ఎస్.సత్తిబాబు వివరణ ఇచ్చారు. విద్యార్థులు హాజరుకు సంబంధించి దీపావళి నాగుల చవితికి విద్యార్థులు సొంత ఇళ్లకు వెళ్ళటం వల్ల హాజరు తక్కువగా ఉందన్నారు. గతంలో ఈ వసతి గృహంలో 100 మందికి పైగా చదువుకునే వారిని, ఎక్కువ మంది విద్యార్థులు హాస్టల్లో ఉండకపోవడం వలన ఇప్పటికే చాలామందిని తొలగించామని తెలిపారు.

డేటా ఆధారంగా సుపరిపాలన

సిఎం కాన్ఫరెన్సుకు హాజరైన మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

డేటా ఆధారంగా సుపరిపాలన అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుండి గురువారం మధ్యాహ్నం 'డేటా ఆధారిత పాలన' అంశంపై ఉన్నతస్థాయి సదస్సు జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖలు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశాయి. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాల్సిన ఆవశ్యకత ప్రతీ శాఖపైనా ఉందని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయాలను విజన్ యూనిట్స్ గా మారుస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. సమావేశంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నుంచి రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర రెడ్డి, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, సిపిఒ పి.బాలాజీ తదితర జిల్లా ఉన్నతాధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. సుపరిపాలన అందించే లక్ష్యంగా రూపొందించిన 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని, గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా ఉపయోగించుకోవాలని సూచించారు.

తైక్వాండోలో హిమశ్రీకి బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 1తేదీ నుంచి రైల్వే కోడూరులో జరిగిన అండర్ 17 రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో శ్రీనివాస జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వి.హిమశ్రీ బంగారు పతకం సాధించింది. బంగారు పతకం సాధించిన విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ యు.వేణుగోపాల్ వర్మ అభినందించారు. రాష్ట్ర పోటీల్లో విజేతగా నిలిచి ఈనెల 15 నుంచి జమ్మూ కాశ్మీర్ లో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ పోటీలో సత్తా చాటి పథకం తేవాలని ఆకాంక్షించారు.

అండర్14 రాష్ట్ర క్రికెట్ పోటీలకు జోయల్ లావిన్

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అండర్ 14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు స్థానిక వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి జోయల్ లావిన్ ఎంపికయ్యాడు. ఈసందర్భంగా లావిన్‌ను పాఠశాల ఛైర్మన్‌సీతయ్య, డైరెక్టర్ టి.వీరస్వామి, ప్రిన్సిపాల్ బి.లక్ష్మణరావు అభినందించారు. రాష్ట్ర పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గురువారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరానికి 48 మంది హాజరయ్యారు. వీరిలో 21 మందిని గుర్తించి శుక్ల ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. ఎంపికైన వారికి కాటరాక్ట్ శస్త్ర చికిత్స చేస్తామని సీనియర్ ఆప్తాలమిక్ ఎస్. జాక్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ జూనియర్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ, సిబ్బంది, స్థానిక పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్ల అధ్యక్షుడిగా గర్భాపు సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దొంతల సత్యనారాయణ, కార్యదర్శిగా పిన్నింటి రాంబాబు, కోశాధికారిగా కోట్ల లక్ష్మీ, కార్యవర్గ సభ్యులుగా ఉత్తర వెళ్లి గణపతి, బాలి అప్పలనాయుడు, మిత్తి రెడ్డి ఆదినారాయణ, కొత్తింటి జగ్గారావు, పంట్ల భాస్కరరావు, బైరెడ్డి రమేష్, చల్లా శ్రీరాములు, లోమిశా శ్రీరామ్ మూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యనారాయణను ఫీల్డ్ అసిస్టెంట్లు అంతా అభినందించారు.

జీరో పని దినాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో ఏ పంచాయతీలోనైనా జీరో పని దినాలుంటే ప్రత్యేక దృష్టి సారించాల్సిందేనని ఎంపిడిఒ జి.భాస్కరరావు అన్నారు. గురువారం మండల సమావేశ భవనంలో రాజాం ఎపిడి పి.చంద్రకుమారి ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం పాండ్లు, పశువుల షెడ్లు, కంపోస్ట్ పిట్లు, ఇంకుడు గుంతలు, ఇకవైసి పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్లను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎపిఒ కామేశ్వరరావు, జెఇ నరేంద్ర, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సి హెచ్ఒ పార్థసారథి

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయ పరిధిలో అరిగిపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 53 మంది వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ శిబిరానికి గ్రామ నాయకులు దుల్ల వెంకటరమణ, ఎం.రామకృష్ణ సహకారం అందించారు. విబిరంలో సిహెచ్‌సి పార్థసారథి, ఎఎన్ఎం ఎంవిఎస్ భాను, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు వేపాడలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యాన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జె.రాములమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోపి ప్రజలు తమ సమస్యలపై ప్రజాదర్బారులో వినతులు అందజేయొచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8న సెంచూరియన్‌లో 'రైతు సమ్మేళనం'

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఈ నెల 8న సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో 'రైతు సమ్మేళనం' నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డిఎన్ రావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మంత్రులు అచ్చెంనాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కె. అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అధితి గజపతిరాజు, లోకం నాగ మాధవి, కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించి వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలు, శాస్త్రవేత్తలతో పరస్పర చర్చలు, ఉత్పత్తుల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

దువ్వుపేటలో 'క్లీన్ అండ్ గ్రీన్'

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా గురువారం దువ్వుపేటలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేపట్టారు. 'స్వచ్ఛ భారత్' మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ ప్రవేశ మార్గం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రపరిచారు. గ్రామస్తులకు వ్యర్థాల వేరు చేయడం, కాంపోస్టింగ్, ప్లాస్టిక్ రహిత జీవన విధానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రవితేజ, అధ్యాపకులు అజీజ్, విద్యార్థి వాలంటీర్లు యశ్వంత్, తనుశ్రీ, నవ్య, దినేష్, దీక్షిత, జానని, షాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సందర్శనపై అవగాహన

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని మదనాపురం మోడల్ పాఠశాల విద్యార్థులకు గురువారం గ్రామ సచివాలయంలో పారిశ్రామిక సందర్శన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో కార్యదర్శి కవిత, సిబ్బంది.. 9వ తరగతి నుండి ఇంటర్ విద్యార్థులకు వృత్తి విద్యలో ఆన్‌లైన్ కార్యకలాపాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రామకృష్ణారావు, ఐటి ట్రైనర్ వెంకటలక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు

ప్రజాశక్తి -బొబ్బిలి

పట్టణంలోని పెట్రోల్ బంకును గురువారం ఆర్‌డిఒ రామ్మోహనరావు పరిశీలించారు. పెట్రోల్, డీజిల్ అమ్మకుండా బంకులో ఆటోలు ఉంచడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ విక్రయించకుంటే వారికి అప్పగించాలని ఆదేశించారు. బంకులో డీజిల్ 900 లీటర్లు, పెట్రోల్ 900 లీటర్లు స్టాక్ ఉండాల్సి ఉన్నప్పటికీ 400 లీటర్ల చొప్పున ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట తహశీల్దార్ ఎం.శ్రీను ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

4 నెలల్లో రూ.25 కోట్లు డిపాజిట్లు సేకరణ
జిల్లాలో మొండి బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు
డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున

ప్రజాశక్తి - చీపురుపల్లి

డిసిసిబి ద్వారా రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. గురువారం ఆయన చీపురుపల్లి కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ చీపురుపల్లి బ్రాంచ్ పరిధిలో ఉద్యోగులు, వ్యాపారస్తుల నుండి సుమారు రూ.30 లక్షల డిపాజిట్లను ఈ నాలుగు నెలల కాలంలో సేకరించారన్నారు. డిసిసిబిలో డిపాజిట్ చేసిన వారికి అధిక వడ్డీ ఇస్తున్నామన్నారు. తాను చైర్మన్‌గా నియామకం జరిగిన నాలుగు నెలల కాలంలో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.25 కోట్ల మేర ఫిక్స్‌డ్ డిపాజిట్లను సంబంధిత అధికారులు సేకరించారని తెలిపారు. గతంలో బినామీ పేర్లతో నిర్ణీత రుణం రూ.20 లక్షల వరకూ పొందవలసి ఉన్నప్పటికీ కొంతమంది సుమారు రూ.100 కోట్ల రుణాల ద్వారా తీసుకున్నారన్నారు. జిల్లా రైతాంగం అభివృద్ధికి కోట్లాది రూపాయల రుణాలు తీసుకున్న వారు బకాయిలు చెల్లించటానికి ముందుకురావాలని, లేని పక్షంలో వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు సంక్షేమం కోసం వ్యాపారులు, ఉపాధ్యాయులు ఇతర ఉద్యోగులను డిసిసిబిలో భాగస్వామ్యం చేస్తూ అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. డిపాజిట్లు ద్వారా రైతు సంక్షేమానికి పెద్దపీట వేనున్నట్టు ఆయన వివరించారు. అనంతరం చీపురుపల్లి బ్రాంచ్ డిపాజిట్లు చేసిన వారికి నాగార్జున డిపాజిట్ బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి బ్రాంచ్ మేనేజర్ ఎం. కల్పన, రామలింగాపురం పిఎసిఎస్ అధ్యక్షులు ఇప్పిలి సురేష్, మహంతి వేణు, డిపాజిట్ చేసిన మామిడి దివ్య, మహంతి లక్ష్మి, టి ఎస్ఎన్ మూర్తి, షేక్ జ్యోత్స్నా తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్ల బాండ్లను అందజేస్తున్న డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున

మన డబ్బులు మన లెక్కలుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డ్వాక్రా సంఘాల మహిళలకు మన డబ్బులు, మన లెక్కలు పై సమావేశం, అవగహన ర్యాలీ గురువారం వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన డబ్బులు, మన లెక్కలు యాప్‌పై డ్వాక్రా సంఘాలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా యాప్ ద్వారా ఆయా సంఘాల ఆర్థిక లావాదేవీలు, అప్పులు, చెల్లింపులు, ఫిర్యాదులు తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు అప్పలనాయుడు, శ్రీను, విజయలక్ష్మి, సుందరం, విఒఎలు, ఈ-నారిమణులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది

వంగర: మహిళ స్వయం సహాయక సంఘ సభ్యులు మన డబ్బులు మన యాప్ వినియోగించుకోవడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డిఆర్‌డిఎ ఎపిడి డి.రత్నాకర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎలు ఈ నారీలకు మొబైల్ బుక్ కీపింగ్‌పై గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు అందరూ తమ సెల్ ఫోన్లలో మన డబ్బులు మన లెక్కలు యాప్ డౌన్లోడ్ చేసుకుని వినియోగించుకుంటే పొదుపు అప్పు కట్టే విధానం, నిల్వలు, వాయిదాలు సంఖ్య, బకాయిలు మొదలగు విషయాలుపై సులువుగా తెలుసుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎ. చిరంజీవి, శ్రీనిధి ఎజీఎం చిట్టిబాబు ఎపిఎం మంగమ్మ, మహిళా సమాఖ్య అధ్యక్షులు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎలకు, ఈ నారీలకు మన డబ్బులు మన లెక్కలుపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ లావాదేవీల పై ఈనారీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు తాడేల స్వాతీ, సిసిలు, ఎంఎంఎస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

'విధులకు డుమ్మా కొట్టి విందులా?

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలోని పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది గురువారం విధులకు డుమ్మా కొట్టి మామిడి తోటలో విందులు, చిందులు వేయడం సరికాదని సిఐటియు నాయకులు బలస శ్రీనివాసరావు పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన ఆస్పత్రికి ఏ క్షణాన ఎవరు ఏ రోగంతో, ప్రమాదంలో గాయపడి వస్తారో తెలియని పరిస్థితి ఉంటుందని, వైద్యులతోపాటు సిబ్బంది నిత్యం అందుబాటులో అందుబాటులో ఉండాలని అన్నారు. మండలంలో నాలుగైదు పంచాయతీల్లో పదుల సంఖ్యలో ప్రజలు అతిసార బారిన తరుణంలో గురువారం మధ్యాహ్నం పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది, ఎఎన్ఎంలు విధులకు డుమ్మా కొట్టి మామిడితోటలో విందు భోజనాలు ఆరగిస్తూ, చిందులేశారని ఆయన తెలిపారు. ఈ విషయంపై వైద్యులు లక్ష్మిని వివరణ కోరగా, మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించి సిబ్బంది శుభకార్యం విందుకు ఆస్పత్రికి సమీపంలోని మామిడి తోటకు వెళ్లామని చెప్పారు. మండలంలో అతిసార ఉధృతంగా ఉందని ప్రశ్నించగా, ఆ గ్రామాలన్నీ తమ పిహెచ్‌సి పరిధి కాదని, ఆరికతోట పరిధిలో ఉన్నాయని చెప్పారు.

జాతీయ సైన్స్ సెమినార్‌లో ప్రతిభ

డెంకాడ : ఇటీవల బెంగళూరులో జరిగిన జాతీయ సైన్స్ సెమినార్-25లో అక్కివరం మోడల్ స్కూల్‌లో 10 తరగతి చదువుతున్న పతివాడ భాను ప్రసాద్ ప్రతిభ కనబరిచాడు. దీంతో ప్రశంస పత్రంతో పాటుగా సైన్స్ కిట్‌ను ఆయనకు బహుమతిగా అందించారు. ఈ నెల 7, 8వ తారీఖున ఢిల్లీలో జరిగే సైన్స్ ఎక్స్‌పోకు నాసా, ఇస్రో సైంటిస్ట్స్‌ని కలిసి మాట్లాడి ఇండో రష్యన్ సైన్స్ కేంద్రాన్ని సందర్శించే అద్భుత అవకాశాన్ని పొందాడు. మొదటిసారి విమానంలో ఢిల్లీకి ప్రయాణం ఎంతో ఉత్సాహంగా ఉందని తెలిపాడు. భాను ప్రసాద్ వల్ల జాతీయ స్థాయిలో అక్కివరం మోడల్ స్కూల్ చోటు సంపాదించినందుకు గాను ఎపి మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్, డిఇఒ తదితరులు అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రవికుమార్

ఆర్ఎస్‌కెల ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలో ధాన్యం కొనుగోలు రైతు సేవా కేంద్రాల ద్వారా నిర్వహించనున్నట్టు ఎఒ సిబి యశ్వంత్‌రావు తెలిపారు. గురువారం సంతకవిటిలో సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో విఎఎలు, పిఎస్‌లు, ఎఫ్‌పిఒలు, టిఎలు, విఆర్ఒ, కస్టోడియన్ అధికారులకు ప్రొక్యూర్‌మెంట్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విధానం, ఎఫ్ఎక్యూ శాంపిల్స్ సేకరణ, వాటి విశ్లేషణ విధానం గురించి వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మండల పరిధిలో వరిసాగు విస్తీర్ణం 21,361 ఎకరాలు ఉండగా, కొనుగోలు కేంద్రాలకు వచ్చే అంచనా ధాన్యం 43,450 మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. మొత్తం 18 క్లస్టర్ల రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరగనుందని వెల్లడించారు. ఏ -గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,389, బి- గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,369 ధరలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మధు, సిఎస్ డిటి అనంత్ కుమార్, సివిల్ సప్లయ్ ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు లెక్కల్లో అక్రమాలకు చెక్

బొబ్బిలిరూరల్ : పొదుపు సంఘాల్లో ఇక ముందు అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం ఈ నారి యాప్‌ను తీసుకు వచ్చిందని ఎంపిడిఒ రవి కుమార్, ఎపిఎం భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో విఒఎలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యాప్ వల్ల సభ్యుల లెక్కలు నమోదు చేయడంలో జవాబుదారీ తనం, పారదర్శకత ఉంటుందన్నారు. సభ్యులకు డిజిటల్ లిటరసీ పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎలొసి సిసి శ్రీహరిరావు, సిసిలు నిర్మల, కేశవ, కోటి, కృష్ణారావు, రామలక్ష్మి, ఎంఎస్ఎ జయలక్ష్మి, విఒఎలు, ఇ-నారీలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- చీపురుపల్లి

మండలంలో పలు అభివృద్ధి పనులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ గులివిందాడ అగ్రహారంలో సుమారు రూ.10లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.13.5లక్షలతో నిర్మించనున్న రాయవలసి పంచాయతీ గుర్రానిపేట ప్రాథమిక పాఠశాల అదనపు గదులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలలో పిల్లలతో కాసేపు ఆయన ముచ్చటించారు. ప్రధానంగా పాఠశాలలో అభ్యసిస్తున్న పాఠ్యాంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చీపురుపల్లిలో సుమారు రూ.61లక్షలతో నిర్మిస్తున్న అన్నక్యాంటీన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రౌతు కామనాయుడు, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ముల్లు రమణ, చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయకమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, తహశీల్దార్ డి.ధర్మరాజుతో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పూసపాటిరేగలో క్యాంప్ కోర్టు

విజయనగరం టౌన్: పూసపాటిరేగలో శుక్రవారం క్యాంప్ కోర్టు నిర్వహిస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ మువ్వల లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. సిజిఆర్ఎఫ్ క్యాంప్ కోర్టు ద్వారా దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో ఓల్టేజి సమస్యలు, కొత్త కలెక్షన్ జారీలో అలసత్వం, మీటరు లోపాలు, సర్వీస్ లోపాలు, బిల్లుల్లో తప్పులు, కాలిపోయిన మీటర్లు, రీ కలెక్షన్ లోపాలు వంటివి అక్కడక్కడే పరిష్కరించే విధంగా క్యాంపు కోర్టు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా ప్రాంతాలు ప్రజలు ఏ సమస్యలున్నా వాటి పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

19 నుంచి డిఎస్‌రాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా క్రికెట్ అసోసియేషన్ అండర్ 19 బాలుర జట్లకు డిఎస్ రాజు మెమోరియల్ ట్రోఫీ టి-20 పోటీలు విజ్జీ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ ఆసోసియేయేషన్ పి.సీతారామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు సెప్టెంబర్ 1 తరువాత లేదా ఆ తర్వాత జన్మించిన బాలురు అర్హులని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ లేదా టెన్త్ మార్క్‌షీట్ తీసుకొని రావాలన్నారు. నాకౌట్ ప్రాతిపదికన పోటీలు జరుగుతాయన్నారు. ప్రవేశానికి ఈనెల 15వ తేదీ ఆఖరు అని తెలిపారు. వివరాలకు టెక్నికల్ కమిటీ ఛైర్మన్ టి.విజయ్ 7013508010. సంతోష్ 7382482535ను సంప్రదించాలన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.22.18 లక్షలకు టోకరా

నలుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-గజపతినగరం

డిజిటల్ అరెస్ట్ పేరుతో వీడియో కాల్ ద్వారా బొబ్బిలికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి చింత రమణ అనే వ్యక్తిని బెదిరించి, అతని నుండి సెప్టెంబర్‌లో రూ. 22 లక్షలు 18 వేల రూపాయలు కాజేసిన కేసులో నలుగురు నిందితులను చెన్నైలో అరెస్ట్ చేసినట్లు విజయనగరం జిల్లా ఎస్‌పి వెల్లడించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ సైబర్ మోసానికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను చెన్నైలో పట్టుకున్నారు.గురువారం గజపతినగరం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి దామోదరం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి కేసు వివరాలను తెలిపారు. నిందితులు వీడియో కాల్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగిని లక్ష్యంగా చేసుకొని, డిజిటల్ అరెస్ట్ పేరుతో భయభ్రాంతులకు గురిచేసి, వారి బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో నగదును వేరే ఖాతాలకు బదిలీ చేయించుకున్నారని వివరించారు. అరెస్ట్ చేసిన నలుగురితో పాటు ఈ మోసంలో భాగస్వామిగా ఉన్న మరొక వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఆ వ్యక్తిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు. కాజేసిన నగదును ఆయా బ్యాంక్ ఖాతాలో సీజ్ చేయించామని తెలిపారు. కేసును చేదించిన పోలీస్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ త్వరలోనే రివార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ తరహా సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే బెదిరింపు కాల్స్ పట్ల జాగ్రత్త వహించాలని ఎస్‌పి సూచించారు. సమావేశంలో డిఎస్‌పి భవ్యరెడ్డి, బొబ్బిలి సిఐ సతీష్, గజపతినగరం సిఐ రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి దామోదర్

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL AT VIZIANAGARAM
O.S. 21/2024

Between:
Sri. Pisini Appala Naidu and Another ....Plaintiffs
And:
Sri. Pisini Shankar rao and others ...Defendants

Notice to Defendants 8 and 9

D8. Badasingi Vimala D/o Adinarayana, house wife, Aged about 40 years, Chelluru Village, and panchayat, Vizianagaram Mandal, Vizianagaram District.

D9. Bodasingi Prameela D/o Adi Narayana, working as a Teacher, Aged about 35 years, Chelluru Village, and panchayat, Vizianagaram Mandal, Vizianagaram District.

The plaintiffs filed the Above suit for partition of the plaint schedule lands and you are intentionally did not received the notices hence this publication the above mater posted for your appearances on **10-11-2025 at 10:30-AM** Before the above Hon'ble court either personally or through an advocate duly authorized by you if fails to appear on 10-11-2025 the mater will be decided in your absence basing on the material available on record

SARIKA HARIBABU
Advocate, MIG 71,
Lakshmi Nivasam,
Alakananda Colony,
Vizianagaram
Ph 8919146166

వంటగదిని పరిశీలిస్తున్న ఎఎస్‌డబ్ల్యుఒ స్వరూప కుమారి

వసతిగృహంలో తనిఖీలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం మండలంలో సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలపై బుధవారం 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రచురితమైన 'అన్ని పనులకు ఒక్కడే' అనే కథనానికి అధికార యంత్రాంగం కదిలివచ్చింది. గురువారం స్థానిక ఎస్‌సి వసతిగృహాన్ని విజయనగరం రూరల్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి వి.ఎల్.ఎం స్వరూప కుమారి తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్‌తో పలు విషయాలపై చర్చించిన ఆమె మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు కాంట్రాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి బిల్లులు చెల్లించాలని, కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగర పాలక సంస్థ కాంట్రాక్టర్ల సంక్షేమ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా గురువారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. ధర్నాను ఉద్దేశించి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు లింగారావు, అశోక్, అధ్యక్ష, కార్యదర్శులు బంగార్రాజు, రాజ్ కుమార్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ అధికారులు కాంట్రాక్టర్లు సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, పాలకులు ముందుకు రాకపోవడం చాలా దారుణమన్నారు. కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు టెండర్ లు పిలిచి,పనులు పూర్తి చేసిన తర్వాత బిల్లులు విషయంలో బిల్లులు చేయకుండా సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని, ఇది సరైనది కాదన్నారు. బిల్లులు చెల్లించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో దువ్వి శ్రీనివాసరావు, రామారావు, సత్యన్నారాయణ, తిరుపతిరావుకాంట్రాక్టర్లు పాల్గొన్నారు. కాంట్రాక్టర్లు పోరాటానికి ఎఐటి యు సి జిల్లా అధ్యక్షులు రంగరాజు మద్దతు తెలిపారు.

ధాన్యం సేకరణలో బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-తెర్లాం

ధాన్యం కొనుగోలులో ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తహశీల్దార్ జి.హేమంత్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో సిఎస్ డిటి స్వర్ణలత ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడారు. ఇ-క్రాప్ నమోదులో వెనుకబడి ఉన్నామని, వాటిని సత్వరం పూర్తిచేయాలని ఆదేశించారు. సిఎస్ డిటి స్వర్ణలత మాట్లాడుతూ కస్టోడియన్ అధికారులు, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు బాధ్యతగా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాసరావు, ఎంఆర్ఐ కృష్ణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

గోపాలమిత్రల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-వేపాడ

జిల్లాలో గోపాలమిత్రల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని గోపాలమిత్ర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీరాములు నాయుడు తెలిపారు. గురువారం ఎస్‌కెఆర్‌పురంలో నిర్వహించిన గోపాలమిత్ర సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. గోపాలమిత్రలకు ఏ సమస్యలు వచ్చినా తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- రేగిడి

ఉచిత వైద్య శిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు తెలిపారు. వావిలవలసలో గురువారం రాహుల్ సౌరబ్ నిత్య అన్నదానం సత్రంలో ఉన్న పేద వృద్ధులకు, వికలాంగులకు, గ్రామస్తులకు సౌరబ్ గౌర్ ఐఎఎస్, జేమ్స్ ఆసుపత్రి వారి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 242 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయగా వీరులో ఏడుగురికి వివిధ ఆపరేషన్లకు రిఫర్ చేశారు. రాజాం రూరల్ సీఐకు వైద్యులు వైద్య తనిఖీలు చేశారు. ప్రజలకు సేవా కార్యక్రమాలు చేసిన సామాజిక కార్యకర్త సిద్ధార్థను అభినందించారు.

అక్రమంగా మద్యం అమ్మితే సంక్షేమ పథకాలు కట్

ప్రజాశక్తి- రేగిడి

గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలు చేపడితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తామని తహశీల్దార్ ఐ.కృష్ణలత హెచ్చరించారు. మండలంలోని సంకిలి, అంబఖండి, దేవుదల, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టిన 52 మంది నిర్వాహకులకు బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ కార్యాలయంలో బైండోవర్ కేసులు నమోదు అనంతరం అక్రమ మద్యమదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహణ వల్ల శాంతిభద్రతలు లోపిస్తున్నాయన్నారు. భవిష్యత్తులో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేపడితే లక్ష రూపాయలు జరిమానా వేసి, జైల్లో పెడతామని హెచ్చరించారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా ఆదేశాలను ధిక్కరించినా వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల నిలుపుదల చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎపి పోస్టల్ కబడ్డీ జట్టు కోచ్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హర్యానా రాష్ట్రం కురుక్షేత్ర లో ఈనెల 10 నుండి 14వరకు జరిగే 36 వ ఆలిండియా పోస్టల్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే కబడ్డీ జట్టుకు కోచ్‌గా విజయ నగరం హెడ్ పోస్టాఫీసులో పనిచేస్తున్న పి. శ్రీనివాసరావు నియమితులయ్యారు. శ్రీనివాస్ రావుకు 1997లో క్రీడా కోటాలో పోస్టల్‌శాఖలో ఉద్యోగం లభించింది. క్రీడాకారుడిగా పలు జాతీయ స్థాయి పోటీలో పాల్గొని జట్టు విజయంలో కీలక భూమిక పోషించారు. పలుమార్లు ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్ గా ఉండి విజయపథంలో నడిపించి బహుమతులు సాధించారు. శ్రీనివాసరావును కోచ్‌గా నిమించడం పట్ల విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమణ రావు, సుందర నాయుడు, పోస్టుమాస్టర్ శాస్త్రి , జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ ,కార్యదర్శి సూరిబాబు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం

కొత్తవలస : వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. కొత్త గవర్నర్‌గా టి.కళ్యాణ్ రాజు, వైస్ గవర్నర్‌గా హనుమాన్ శెట్టి నానాజీ, రీజియన్ జోనల్ ఛైర్మన్‌గా కొల్లా సాయికిశోర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సెక్రటరీ గార్లపాటి శ్రీనివాసులు, ట్రెజరర్ పి.ఎస్.వెంకట్ నారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

నెల్లిమర్ల : సతివాడ, నెల్లిమర్ల ఐడిఎ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలుగోలు, గుషిణి చనమల్లపేట, జోగిరాజుపేట, రాగోలు వ్యవసాయ కనెక్షన్లకు, అలుగోలు, గుషిణి, చనమల్లపేట, బర్లపేట, పల్లిపేట, కొత్తూరు, జోగిరాజుపేట గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం నాగమణి, పిడీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు మరుపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - గజపతినగరం

మరుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. దీంతో గురువారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.నాగమణి వారిని అభినందించారు. ఖోఖో, స్విమ్మింగ్, నెట్ బాల్, రగ్బీ క్రీడల్లో సత్తా చాటి, పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పార్వతి, విష్ణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా త్వరితగతిన ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితా త్వరితగతిన ఇవ్వాలని తహశీల్దార్ కె.శ్రీకాంత్ కోరారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దారు అధ్యక్షతన ఎన్నికల విభాగం డిటి వివిఆర్ జగన్నాధరావు ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు శ్రీకాంత్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఓటరు జాబితాలు తయారు చేయటంలో బూతు లెవెల్ ఏజెంట్‌లు ముఖ్య భూమిక పోషిస్తారని వారి జాబితాను ఇవ్వాలని, గత 6 నెలల నుంచి కోరుచున్నా, ఒక్క టిడిపి వారు మాత్రమే జాబితాను ఇచ్చారని తెలిపారు. మిగతా రాజకీయ పార్టీలు కూడా త్వరగా జాబితాలు తయారు చేసి ఇవ్వాలని కోరారు. ఓటరు జాబితాల్లో ఓటును ఒక పిఎస్ నుండి వేరొక పిఎస్‌కి మార్చటం, కొత్తగా నమోదు చేయటం, తొలగించటం, (ఫారం 6,7,8) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, వైసిపి నాయకులు ఎస్.రామారావు, సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాజన సభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లా ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 8న ఉదయం 9:30 గంటలకు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ మహాజన సభను ఘనంగా నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా చైర్మన్ జి. మహేంద్ర బాబు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించడం, న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, జెఎసిని మరింత బలోపేతం చేయడమే ధ్యేయంగా మహాజన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

రోడ్డు వేశారు.. కాలువలు మరిచారు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ద్వారకానగర్ లైన్ 4 లో రోడ్డు వేసి కాలువలు నిర్మించకపోవడంతో వర్షాలకు రోడ్డు కిందకు జారిపోతోంది. ఇటీవల కొద్ది రోజులు క్రితం 45 మీటర్లు సిసి రోడ్డు రోడ్డు వేశారు. వాస్తవానికి 55 మీటర్లు రోడ్డుకు ప్రతిపాదనలు వేస్తే కేవలం 45 మీటర్లు రోడ్డు వేసి మరో పది మీటర్లు రోడ్డు వేయకుండా విడిచిపెట్టారు. రోడ్డు వేసి రెండు వైపులా కాలువలు నిర్మించకపోవడంతో వర్షాలకు పక్కనే ఉన్న మట్టి జారిపోయి రోడ్డు కుంగిపోయి ఇబ్బందిగా మారింది. మరో వైపు రోడ్డు చివర భాగంలో రక్షణ గోడ కట్టేందుకు ప్రతిపాదన చేసినప్పటికీ గోడ నిర్మాణం కూడా చెయ్యకుండా విడిచిపెట్టారు. దీంతో విజ్జి మైదానం నుంచి వచ్చిన నీరు ఇదే ప్రాంతం గుండా రావడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. వెంటనే కాలువలు నిర్మించి రోడ్డు పాడవకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు గట్టు వద్ద బీటలు వారిన రోడ్డు

కోతకు గురైన రోడ్డు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామ సమీపంలో చెరువు గట్టు రోడ్డు కోతకు గురైంది. పొలం వైపు రోడ్డు కోతకు గురై, ప్రమాదకర స్థాయికి చేరింది. ఇదే మార్గంలో బడిబస్సు రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. వెంటనే ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి బస్సుకు ఆటంకం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ నాయకులు అప్పలనాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విపరీతంగా కురుస్తున్న పొగ మంచు

మంచు దుప్పటి

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలోని గ్రామాలను మంచు దుప్పటి కప్పేస్తోంది. మూడు రోజులుగా పొగ మంచు ఉదయం ఏడున్నర గంటల వరకు కురుస్తోంది. రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనాల లైట్లను ఆన్‌లైన్ చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలో అసలే మలుపులు ఎక్కువ. ఎప్పుడు, ఎవరు ఎదురుగా వస్తారో, ఎక్కడ ప్రమాదానికి గురవుతామోనన్న భయంతో వాహనదారులు ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇసుక దుమారం

- మొంథా తుపానుతో గోస్తనీలో భారీగా ఇసుక మేటలు
- తరలింపునకు పోటా పోటీ ప్రయత్నాలు

ఇసుకను తరలించేందుకు కాలువను కప్పేసిన దృశ్యం

ప్రజాశక్తి - జామి రూరల్

జామిలో ఇసుక దుమారం రేగితోంది. మొంథా తుపానుకు గోస్తనీ నదిలో భారీగా ఇసుక మేటలు ఏర్పడడంతో ఆ ఇసుకను తరలించేందుకు పెద్ద ఎత్తున పోటీ పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంలో భాగంగా నదీ పరివాహక ప్రాంతంలోని కొంత మంది రైతులు ఇసుకను పోగులు వేసుకున్నారు. కానీ ఎప్పటి నుంచో ఇసుక దందాకు అలవాటు పడ్డ కొంత మంది పెద్దలు రైతులను బెదిరించి ఇసుకను తరలించేందుకు సిద్ధమవడంతో గొడవకు రాజకీయ రంగు పులుముకుంది. రైతుల తరుపున మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకట త్రివేణి, బిజెపి నాయకులు ఆదిలక్ష్మి వెళ్లి ఇసుక దందా చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. మరోవైపు గ్రామ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి పంచాయితీ పనులకు ఇసుక కావాలంటూ ఆందోళన చేశారు. దీంతో ఇసుక రగడ రాజకీయ దుమారానికి తెరలేపింది.

సాగునీటి కాలువను కప్పేసి ఇసుక తరలింపు

జాగారం - అన్నంరాజుపేట (జెఎ ఛానల్) సాగునీటి కాలువను కప్పేసి మరి జామి గ్రామంలో ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి ఉచిత ఇసుక విధానంలో ప్రజల అవసరాలకు మాత్రమే ఇసుక తరలించాలి. కానీ ఇసుక వ్యాపారం చేస్తున్న ఇసుకాసురులే ఎక్కువ తవ్వకాలు చేస్తున్నారు. రాత్రి పగలూ తేడా లేకుండా ఇసుక తవ్వేస్తున్నా అధికారులు అడ్డుకోవడం లేదు. ఇప్పటికైనా ఇసుక తవ్వాకాలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల అవసరాలకే ఇసుక తరలించాలి

ఉచిత ఇసుక విధానంలో ప్రజల అవసరాలకు, అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుక ఉచితంగా తరలించాలి. వ్యాపారం చేస్తున్న వారిపై సంబంధిత అదికారులు చర్యలు తీసుకుంటారు.

ఎంపిడిఒ అప్పలనాయుడు, జామి ఎంపిడిఒ

7200 లీటర్ల ఊట ధ్వంసం

ప్రజాశక్తి- సాలూరు

స్థానిక పోలీసులు, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా మండలంలోని దొర్లతాడివలస, సుల్లరి గ్రామాల్లో గురువారం దాడులు నిర్వహించి 7200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ జాయింట్ ఆపరేషన్‌లో, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటూ డ్రోన్ల సహాయంతో మారుమూల ప్రాంతాలపై నిఘా పెట్టారు. ఈ గ్రామాల్లో దట్టమైన అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించి ధ్వంసం చేశారు. అక్రమ నాటుసారా తయారీని అరికట్టేందుకు ఈ తరహా దాడులు నిరంతరాయంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో రూరల్ సిఐ పి. రామకృష్ణ, ఎక్సైజ్, ఎస్‌టిఎఫ్ అధికారులు, మక్కువ, సాలూరు రూరల్ ఎస్ఐలు, 45 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో జెసి పర్యటన

భద్రగిరి ఆసుపత్రి, ఆశ్రమ పాఠశాలలను పరిశీలించిన యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి విభాగం ఏర్పాటు చేయాలని మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలు పై ఆరా తీశారు. స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది పనిచేయాలన్నారు. వైటిసిలో ఉన్న గర్భిణుల ప్రసూతి కేంద్రాన్ని భద్రగిరి ఆసుపత్రికి మార్చాలని సూచించారు. వైద్యశాలలకు నూతన డాక్టర్ల నియామకం ప్రభుత్వం చేపడుతుందన్నారు. కొత్తగా నిర్మించిన 50 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఆసుపత్రికి వెళ్లి వచ్చేందుకు వీలుగా సిమెంటు రోడ్డు, కాలువలు నిర్మాణం చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం భద్రగిరి పిటిజి, గుమ్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో సమస్యలను పరిశీలించారు. మరుగుదొడ్లు, డార్మెటరీ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పిటిజి పాఠశాలకు ఆరోప్లాంట్ మంజూరైనట్లు చెప్పారు. విద్యార్థులకు అనారోగ్యం వస్తే వెంటనే స్పందించి వైద్యం చేయిస్తున్నారని అన్నారు. ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నారని జెసి తెలిపారు. ఎంపిడిఒ, తహశీల్దార్, ఎంఇఒ మండల అధికారులు అందరూ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను ఎప్పటికప్పుడు సందర్శించాలని ఆదేశించినట్లు చెప్పారు. జిసిసి గోదాములను పరిశీలించి స్టాక్ నిల్వ, రికార్డులు పరిశీలించారు. ఈ పర్యటనలో భద్రగిరి ఐటిడిఎ డిఇ చాణిక్య, ఎఇ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జెసి

అభ్యసన స్థాయిని పెంచేలా విద్యా ప్రగతి

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులలో కనీస అభ్యసన స్థాయిని మెరుగు పరిచే విధంగా విద్యా ప్రగతి ఉండాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ పవార్ స్వప్న జగన్నాథ్ అన్నారు. విద్యాప్రగతి అనే నూతన కార్యక్రమాన్ని సీతంపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆయన గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా మూడో తేదీన ఐటిడిఎ పాఠశాలలన్నింట్లో బేస్ లైన్ టెస్ట్ నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల స్థాయిని ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4గా తెలుగు, ఇంగ్లీష్, హిందీ, లెక్కల విభాగంలో పరీక్ష నిర్వహించి విద్యార్థులను వర్గీకరించామనీ తెలిపారు. ఎల్1 నుంచి ఎల్ 4లోనికి తీసుకురావడానికి 50 రోజుల క్యాలెండర్ విడుదల చేసామని తెలిపారు. అక్షరాల నుంచి పదాలు పదాల నుండి వాక్యాలు వాక్యాల నుండి వ్యాసంగా చదవడానికి రాయడానికి విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమర్థవంతమైన పాత్ర వహించి విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ జి.రామ్ మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు వసంతలక్ష్మి, వసతి గృహ అధికారి పాలక అమల, సిఎంఒ చిరంజీవివులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రగతి నివేదికను అందిస్తున్న పిఒ

భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలి

ప్రజాశక్తి -సీతానగరం

భవన కార్మికులకు పనులు కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం మండల కార్యదర్శి తోలాపు రమేష్ అన్నారు. గురువారం సీతానగరంలో వారు మాట్లాడుతూ మండలంలో భవన నిర్మాణరంగంపై ఆధారపడుతూ తాపీ మేస్త్రి, కార్పెంటర్, ఎలక్ట్రీషన్, ప్లంబర్, రాడ్ బెండర్, పెయింటర్లతో పాటు హెల్పర్లు, మహిళా కార్మికులు సుమారు 600 మంది వరకు పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కన్నా కొత్త ప్రభుత్వం మేలు చేస్తుందని ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిస్తే నేడు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవన కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టాల్సిన నిధులను ఇతర పథకాలకు దారి మళ్లిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టినందున గతంలో వ్యవసాయ కార్మికులుగా ఉన్న తాము ప్రత్యామ్నాయంగా భవన నిర్మాణ పనుల్లోకి వచ్చామని తెలిపారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విధానాల వల్ల పూర్తిగా పనులు కోల్పోతున్నామని, వలసలు పోదామంటే అక్కడ కూడా పోటీ ఎక్కువగా ఉందని, ఉన్న ఊరిలో బతకలేక భార్య, పిల్లల్ని, పస్తులతో ఉంచలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సంక్షేమ నిధి నుంచి కొంత నిధిని నిరుద్యోగ భృతి కింద నమోదైన ప్రతి కార్మికుడికి చెల్లించాలని, లేనిచో భవిష్యత్తులో యావత్ కార్మిక వర్గాన్ని సంఘటితపర్చి ఆందోళన, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శనపతి కృష్ణ, నాయకులు రాయిపల్లి రాము, రంకిరెడ్డి శంకర్రావులు పాల్గొన్నారు.

డోలీ మోతలు ఉన్న రోడ్లను గుర్తించాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో డోలి మోతలు ఉన్న గ్రామాలకు సంబంధించిన రోడ్లను గుర్తించాలని పంచాయతీరాజ్ ఈఈ జి. రవి సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 14 రోడ్లు మంజూరయ్యాయని ఇంకా గ్రామాల్లో ఎక్కడైతే డోలిమోతలతో ఉన్నాయో అటువంటి రోడ్లను సమగ్ర సర్వే చేపట్టి గుర్తించి నివేదిక అందిస్తే ఉన్నతాధికారులకు పంపించి రోడ్లు మంజూరయ్యేలా చర్యలు చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

త్వరతగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలి

త్వరతగతిన గృహ నిర్మాణాలు చేపట్టేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని పిఆర్ ఈఈ, హౌసింగ్ ఈఈ జి.రవి అన్నారు. గురువారం మండలంలో వబ్బంగి, నీలకంఠాపురం, పెద్ద గొత్తిలి పంచాయతీల్లో గల పలు గ్రామాల్లో పీఎం జన్మమన్ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని, బిల్లు కూడా త్వరతగతిన ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. ఇంకా ఎవరికైనా బిల్లులు పడకపోతే హౌసింగ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ రవి

ఓర్పుతోనే విద్యార్థులకు నేర్పు : ఆర్‌జెడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధ్యాయులు ఓర్పుతో విద్యార్థులకు నేర్పితే మంచి ఫలితాలు అందుకోగలరని ఆర్‌జెడి విజయభాస్కర్ సూచించారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వినతి మేరకు గుమ్మలక్ష్మీపురం మండలంలోని దుమ్మంగి, బొద్దిడి, పి. ఆమిటి ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలుగా మార్చిన నేపథ్యంలో వాటి పనితీరుపై ఏజెన్సీలో ఆయన గురువారం సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎంత ఓర్పుగా పాఠ్యాంశాలు చెబితే విద్యార్థులు అంత నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారన్నారు. ప్రతి పాఠశాలలో ఈ విధానం అవలంబిస్తే నూరు శాతం ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ రకమైన బోధన లేకపోవడంతో ఏజెన్సీలో విద్యార్థులు ఇంకా వెనుకబడి ఉన్నారని అన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు సందర్శన సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు, చదువు పట్ల ఆసక్తి, ఏ మేరకు నేర్చుకున్నారు, ఉపాధ్యాయుల బోధన విధానం వంటి అంశాలను పరిశీలించారు. విద్యార్థులు డ్రాపోర్ట్ లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. చదువు పట్ల విద్యార్థులు భయాన్ని పోగొట్టేందుకు ఆటపాటలతో విద్యా బోధన చేయాలన్నారు. ఈ పర్యటనలో ఎంఇఒలు చంద్రశేఖర్, బిడ్డిక బీముడు, ఉపాధ్యాయులు అడ్డాకుల గుండునాయుడు, ఎస్టీ కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్‌జెడి విజయభాస్కర్

అక్రమంగా తరలిపోతున్న మట్టి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఇరిగేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న సోమసాగరం చెరువు నుంచి పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా తరలిస్తుడడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులను రక్షించాల్సిన ఇరిగేషన్ అధికారుల కళ్ల ముందే జెసిబి యంత్రాలతో చెరువులో మట్టి తవ్వకాలు సాగుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు సమాచారం మేరకు, గత కొన్ని రోజులుగా పగలు, రాత్రి తేడాలేకుండా ట్రాక్టర్లతో చెరువులోని మట్టి తీసుకెళ్తున్నారు. ఈ మట్టిని సమీపంలోని ప్రైవేట్ లేఅవుట్లు, కట్టడాలు, కాంట్రాక్ట్ పనుల కోసం వినియోగిస్తున్నారని సమాచారం. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు, తహశీల్దార్, పంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదులు చేసినా చర్యలు కనిపించలేదని ఆరోపిస్తున్నారు. చెరువు తవ్వకాల వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గి వర్షాలు పడ్డా నీరు నిల్వ ఉండడం లేదని, భవిష్యత్తులో నీటి కొరత తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకొని చెరువును రక్షించాలని, అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మట్టిని జెసిబితో తవ్వి ట్రాక్టర్‌కు ఎత్తుతున్న అక్రమార్కులు

గురుకుల పాఠశాల సందర్శన

కురుపాం: మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలను ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న వాకింగ్ ట్రాక్, గ్రౌండ్ సమతుల్య పనులను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ విజయలక్ష్మితో మాట్లాడి జరుగుతున్న పనులు విద్యార్థుల ఆరోగ్యం గూర్చి తెలుసుకొని ముస్తాబు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి విద్యార్థులు ఆరోగ్యం, విద్యపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు సలహాలు అందించారు.

గ్రామ సమస్యలపై టిడిపి వినతి

ప్రజాశక్తి- బలిజిపేట

అన్ని గ్రామాల సమస్యలపై తక్షణమే అధికారులు స్పందించాలని టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు కోరారు. గురువారం ఆయన టిడిపి నాయకులతో కలిసి పలు గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్, ఎంపిడిఒలకు వినతి పత్రాన్ని అందించారు. తహశీల్దార్ కార్యాలయంలో హెచ్‌డిటిని కలిసి రెవెన్యూకు సంబంధించిన సమస్యలు, భూ వివాదాలు, పౌర సేవల్లో జాప్యం వంటి అంశాలపై వివరించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒని కలిసి గ్రామీణాభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు కొరత, ప్రభుత్వం నుండి మంజూరు కావాల్సిన నిధులపై చర్చించారు. ఉపాధి హామీ, వ్యవసాయశాఖ ఎఒను కలిసి రైతులు, ఉపాధి కూలీలు పడుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పెంకి వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ మండలంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, అధికారులు ప్రజల పట్ల సానుకూలంగా స్పందించి, తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

సంతలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో గురువారం జరిగిన వారపు సంతలో రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుకృత ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సంతకు వచ్చిన గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసి వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దశమంతపురంలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని దశమంతపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి యం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, చిన్నారులకు, ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - కొమరాడ

ఒడిస్సా నుంచి ఆంధ్రాలోకి ఎటువంటి మత్తు పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. గురువారం రాయగడ నుంచి విజయనగరం వెళ్లే కుర్దా రైలులో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు, జిఆర్‌పి పోలీసులు ఆర్పిఎఫ్, ఎస్‌టిఎఫ్, ఈగల్ టీం బృందాలతో రైలులో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి మత్తు పదార్థాలు రవాణా జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయమని తెలిపారు. ట్రైన్‌లో ప్రయాణికుల బ్యాగులను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అనుమానిత బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విడిచిపెట్టినట్టు తెలిపారు. ఇటీవల కాలంలో గుట్టుగా ప్రైవేట్ వాహనాల్లో కాకుండా ట్రైన్లో అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో నిఘా కట్టుదిట్టం చేశామని తెలిపారు. కూనేరు నుంచి విశాఖ వరకు ప్రయాణించిన ట్రైన్‌లో అన్ని భోగీలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఈ తనిఖీల్లో జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ఎస్, ఈగల్ టీం బృందాల పోలీసులు ఉన్నారు.

రైల్వే తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, ఒడిశా ప్రాంతాలకు రాకపోకలు సాగించే మోటారు సైకిళ్లు, ఆటోలు, వ్యాన్‌లు తదితర వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరికీ లైసెన్స్ ఉండాలని, వాహనాలకు అన్ని అనుమతి పత్రాలూ ఉండాలని సూచించారు.

సీతంపేట: స్థానిక అడ్వెంచర్ పార్క్ వద్ద సీతంపేట ఎస్క్మి వై.అమ్మనరావు గురువారం వాహనాలు తనిఖీ చేపట్టారు. క్షుణంగా వాహనాలకు సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మితిమీరిన వేగం పనికిరాదని ప్రయాణికులకు యువతకు ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవ్ ఉన్నారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 165/2023

అల్లు ప్రభాకర్ ......వాది
అండ్
బత్తుల సరస్వతి వగైరాలు ....ప్రతివాదులు
ఓన సీతా మహాలక్ష్మి భర్త మధు, (2వ ప్రతివాది) 27 సం॥లు, నడుపూరు గ్రామం, పాలకొండ మండలం, (రూరల్) పార్వతీపురం మన్యం జిల్లా.

నెంబరుకేసులో ఇందలి వాది గారు 2వ ప్రతివాదిపై పై కోర్టులో కేసును దాఖలు చేసి యున్నారు. పై నెంబరు కేసులోని ఇందలి 2వ ప్రతివాదికి తే 25-11-2025 దీన పై కోర్టులో వాయిదా అయి యున్నది. పై నెంబరు కేసులో 2వ ప్రతివాది అయిన మీరు **తే 25-11-2025 దీన ఉదయం 10-30 గం॥లకు** మీరు గాని, మీ వలన ఆర్డరు పొందిన వారు గానీ, మీ తరుపున వకీలు గారు గానీ, పై కోర్టులో హాజరు అయి మీ తరుపున వాదన దాఖలు చేసుకొనవలెను. లేనిచో పై కేసు మీ పరోక్షమున తీర్మాణం జరుగునని ఇందు మూలముగా తెలియ జేయడమైనది.

వాయిదా 25-11-2025 ది.

(వాది తరుపు న్యాయవాది)
గంట అప్పలనాయుడు
న్యాయవాది,
సాలూరు మునిసిపాలిటీ,
పార్వతీపురం మన్యం జిల్లా 535591.

సాలూరు
06-11-2025